సాక్షి

# ప్రజలకు మెరుగైన సేవలందించాలి

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** ప్రభుత్వ శాఖాధికారులందరూ ప్రజా సేవకులని, పౌరులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా, శాశ్వత లోక్ అదాలత్ (ప్రజా ప్రయోజన సేవలు) చైర్మన్ జి.జ్ఞానశ్రీ సువర్ణరాజు సూచించారు. శనివారం స్థానిక న్యాయ సేవా సదన్ కార్యాలయంలో శాశ్వత లోక్ అదాలత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హై లెవెల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవలకు భంగం వాటిల్లితే, ఆ వ్యక్తి శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చన్నారు. ఆ విధంగా వచ్చిన కేసులను శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ తీర్మానించి, సమస్యను బట్టి సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీచేస్తారని, సమస్య లేకుంటే కేసు ముగిస్తారని వివరించారు. శాశ్వత లోక్ అదాలత్‌పై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో కేసులు చేయడానికి ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ కేసైనా కేవలం 90 రోజుల్లో పరిష్కారమవుతుందని, సివిల్ కోర్టుల్లో మాదిరిగా ఏళ్ల తరబడి నిరీక్షించాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ గృహ నిర్మాణ సంస్థ, రెవెన్యూ, ప్రజా రవాణా సంస్థ, నగర పాలక సంస్థ, తపాలా, బ్యాంకింగ్, ఉపాధిహామీ, నీటిసరఫరా, పారిశుధ్యం, విద్య, భీమా, వైద్య సేవలు, విద్యుత్, టెలిఫోన్ తదితర సేవలు సమాజంలోని పౌరులకు పక్కాగా అందించాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



**సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా**

Date: 16/07/2023, Edition: Srikakulam(Srikakulam District), Page: 8
Source : https://epaper.sakshi.com/